@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శనివారం 22, జూన్ 2024 || పేజిలు: 04



## బీఆర్ఎస్ పార్టీకి
# బిగ్ షాక్..

- కాంగ్రెస్ ఆకర్ష్‌కు పోచారం అట్రాక్షన్
- కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నేత పోచారం
- పోచారం ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన సిఎం రేవంత్
- తండ్రీకొడుకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం
- తెలంగాణ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నట్లు ప్రకటన
- రైతు సంక్షేమం కోసమే అని ప్రకటించిన శ్రీనివాసరెడ్డి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్21:

భారాసకు భారీ షాక్ తగిలింది. తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు ఆయన కుమారుడూ కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల సందడి సద్దు మణగడంతో కాంగ్రెస్ ఆకర్ష్‌కు పదను పెట్టింది. చాపకింది నీరులా వ్యవహారం చక్కబడింది. అనూహ్యంగా పోచారం శ్రీనివాసరెడ్డి స్వయంగా సిఎం రేవంత్‌ను తన ఇంటికి ఆహ్వానించారు. దీంతో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపి బలరామ్ నాయక్ తదితరులు మిగతా 2లో..





# రైతులకు
# గుడ్‌న్యూస్

## రుణమాఫీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

### ఇచ్చిన హామీ మేరకు 2లక్షల రుణమాఫీ
### కేబినేట్ భేటీలో కీలక నిర్ణయం..

- ఐదేళ్ల కాలంలో తీసుకున్న రుణాలకు వర్తింపు
- 2018 డిసెంబరు 11 కటాఫ్ తేదీగా నిర్ణయం
- 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు పరిగణన
- మీడియాకు వివరాలు వెల్లడించిన సిఎం రేంవత్ రెడ్డి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్21:

తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రుణాల మాఫీకి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రుణమాఫీకి కటాఫ్ నిర్ణయించింది. డిసెంబర్ 9వ తేదీని రుణమాఫీ కటాఫ్ తేదీగా ఏకగ్రీవ తీర్మానం చేసింది రాష్ట్ర కేబినెట్. అంతేకాదు.. రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 9, 2023 ముందు నాటికి తీసుకున్న రుణాలన్నింటినీ ఒకే విడతలో మాఫీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 47 లక్షలకు పైగా మంది రైతులకు ఊరట లభించనుంది. మిగతా 2లో..





## నేడు పులివెందుల
# పర్యటనకు
# వైఎస్ జగన్

నేటి ఫోకస్ న్యూస్, అమరావతి:

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఈ నెల 22న వైఎస్సార్ జిల్లా పులివెందుల పర్యటనకు వెళ్లనున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కడప ఎయిర్ పోర్ట్‌కు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పులివెందుల వెళతారు. 3 రోజుల పాటు పులివెందులలో జగన్ అందుబాటులో ఉంటారు. ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం అనంతరం తాడేపల్లి ప్యాలెస్‌ను వీడి ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి బయటకు వచ్చింది లేదు. నిన్న తొలిసారిగా అసెంబ్లీకి హాజరు కావడం కోసమని బయటకు వచ్చారు. ఇక నేడు సొంత నియోజకవర్గం పులివెందులకు మాజీ సీఎం జగన్ రెడ్డి రానున్నారు. పులివెందుల లోనే 5 రోజుల పాటు మకాం వేయనున్నారు. నియోజకవర్గంలో మండలాల వారిగా వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సొంతగడ్డ పులివెందుల్లో కూడా ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో తమకు భారీగామెజారిటీ తగ్గడానికి కారణాలపై సమీక్షల్లో చర్చిస్తారని సమాచారం.

## నెరవేరిన చంద్రబాబు
# శపథం..



### సీఎంగానే సభలోకి అడుగుపెట్టిన చంద్రబాబు



- టిడిపి శ్రేణులు ప్లకార్డులతో స్వాగతం..
- హర్షధ్వానాల మధ్య సభలోకి వచ్చిన సిఎం..

నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్21:

చంద్రబాబు చేసిన ప్రతినను నిలబెట్టుకున్నారు. అయిదేళ్ల క్రితం 23స్థానాలకే పరిమితమైన స్థాయి నుంచి.. అసెంబ్లీలో వ్యక్తిత్వ హననం, కుటుంబ సభ్యులకు జరిగిన అవమానం, అధికార మిగతా 2లో..

## బొగ్గు గనుల వేలంతో
# సింగరేణికి ఉరి

- కాంగ్రెస్, బిజెపిలకు తెలంగాణ పట్ల సోయిలేదు
- మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

వివరాలు 02లో..





## వ్యవసాయ పరిశోధనకు
# ఊతమివ్వాలి

- మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలి
- ఎరువుల సబ్సిడీలను హేతుబద్ధీకరించాలి
- వ్యక్తులకు ఆదాయపన్ను తగ్గించాలి
- వర్తకులకు జీఎస్‌టీ మినహాయింపులు
- బడ్జెట్‌పై వివిధ వర్గాల సూచనలు

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ:

సాగు రంగం బలోపేతానికి తీసుకోవాల్సిన పలు చర్యలను నిపుణులు, వ్యవసాయ రంగ మండళ్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లాయి. 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్‌కు ముందు ఆర్థిక మంత్రి వివిధ రంగాల ప్రతినిధులతో సంప్రదింపులు చేపట్టారు. వ్యవసాయ పరిశోధనపై పెట్టుబడులు మరింతగా పెంచాలని, ఎరువుల సబ్సిడీలను హేతుబద్ధీకరికంచాలని ఈ సందర్భంగా ఆయా రంగాల ప్రతినిధులు సూచించారు. ఆర్థిక వ్యవస్థలో వినియోగం పుంజుకోవడానికి వీలుగా వ్యక్తిగత ఆదాయపన్ను రేట్లను తగ్గించాలని, తక్కువ రేటుకు వర్తకులకు రుణాలు అందించాలని రిటైల్ వర్తకుల సమాఖ్య ఆర్థిక మంత్రిని కోరింది. వర్తకులకు జీఎస్‌టీ విషయంలో పలు వెసులుబాట్లు కల్పించాలని జీటీఆర్ఐ సూచించింది.

### వ్యవసాయ రంగం పటిష్టత కోసం..

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకుని నిలబడేందుకు వీలుగా సాగు రంగంలో మౌలిక వసతులను బలోపేతం చేయాలని నిపుణులు

# బొగ్గు గనుల వేలంతో సింగరేణికి ఉరి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్21:

సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడం అనేది.. సింగరేణికి ఉరి వేయడమే అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాల పట్ల కాంగ్రెస్, బీజేపీ నేతలకు సోయి లేదు. ప్రాజెక్టుల విషయంలో కేంద్రం కుట్రలను ఖండించాం. కేసీఆర్ కదిలిన తర్వాతే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించబోమని అసెంబ్లీలో తీర్మానం చేశారు. గోదావరి జలాల తరలింపుపై గతంలో కేసీఆర్ గళమెత్తారు. ఇప్పుడు గోదావరి నీళ్లు దోచుకుపోతుంటే రేవంత్ రెడ్డి స్పందించలేదు. సింగరేణిని ప్రయివేటీకరణ కుట్రకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయి. ఇప్పుడు సింగరేణిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామరక్ష అని మళ్లీ నిరూపితమవుతోంది. బొగ్గు గనుల అంశంలో ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారు. బొగ్గు గనుల వేలం వద్దని గతంలో రేవంత్ రెడ్డి ఇదే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఇవాళ మాత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వేలంలో పాల్గొన్నారు అని మండిపడ్డారు.కిషన్ రెడ్డి పదవి తీసుకొని హైదరాబాద్‌లో దిగిన మొదటి రోజే తెలంగాణ రాష్ట్ర ప్రజలకి ద్రోహం చేసే పని చేశాడని జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. కొంత మందికి పదవులు వస్తే అదృష్టం వచ్చింది అనుకుం టాం కానీ కిషన్ రెడ్డి దురదృష్టవంతుడు. కిషన్ రెడ్డికి ఎన్ని పదువులు వచ్చినా ఈ రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కటి కూడా చెయ్యలేదు.. గత ఐదేండ్లలో కిషన్ రెడ్డి చేసింది ఏమైన ఉందంటే అక్కడ ఎక్కడో రైల్వే స్టేషన్లో పాత లిఫ్టును బాగు చేసి ప్రారంభించడం. ఈసారి క్యాబినెట్ పదవి తీసుకొని హైదరాబాద్ వచ్చిన మొదటి రోజే మన తెలంగాణను ద్రోహం చేసే పని, మన సింగరేణిని నట్టేట ముంచి దానికి ఉరి పెట్టే పని చేశాడు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వ్యవసాయ పరిశోధనకు ఊతమివ్వాలి

(మొదటి పేజీ తరువాయి..)

చేయాలని నిపుణులు సూచించారు. వ్యవసాయ రంగంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ)కి పెద్ద పీట వేయాల్సిన అవసరాన్ని ఇండియన్ చాంబర్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐసీఎఫ్ఏ) చైర్మన్ ఎంజే ఖాన్ ప్రస్తావించారు. దీనివల్ల సాగు రంగం మరింత వృద్ధి పథాన సాగుతుందని, రైతుల ఆదాయం మెరుగుపడుతుందని చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)కు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు రూ.9,500 కోట్ల నుంచి రూ.20,000 కోట్లకు పెంచాలని సూచించారు. ప్రత్యక్ష నగదు బదిలీ రూపంలో (డీబీటీ) ఇచ్చే అన్ని రకాల వ్యవసాయ సంబంధిత సబ్సిడీలను హేతుబద్ధీకరించాలని, 2018 నుంచి ఎలాంటి మార్పుల్లేని యూరియా రిటైల్ ధరలను పెంచాలని, సబ్సిడీల ద్వారా బయో ఫర్టిలైజర్స్, ఫోలియర్ ఫర్టిలైజర్స్‌ను ప్రోత్సాహించాలన్న సూచనలు ఆర్థిక మంత్రి దృష్టికి వచ్చాయి. ఇతర పెట్టుబడులతో పోల్చి చూస్తే వ్యవసాయ పరిశోధన పెట్టుబడులపై వచ్చే ఆర్థిక ప్రయోజనాలు పది రెట్లు అధికంగా ఉన్నప్పటికీ.. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో బడ్జెట్ కేటాయింపులు ద్రవ్యోల్బణం కంటే తక్కువ ఉండడాన్ని భారత్ కిసాన్ సమాజ్ చైర్మన్ అజయ్ వీర్ జఖార్ గుర్తు చేశారు. ఎంఎస్‌పీ కమిటీని వేరు చేయాలని, నూతన వ్యయసాయ రంగ విధానాన్ని తీసుకురావాలన్న సూచనలు కూడా వచ్చాయి. వ్యవసాయ ఎగుమతులకు ఊతమిచ్చేందుకు వీలుగా అపెడాకు కేటాయింపులను రూ.80 కోట్ల నుంచి రూ.800 కోట్లకు పెంచాలని జిల్లా స్థాయిలో ఎగుమతుల కేంద్రాలు తెరవాలని పలువురు సూచించారు.

# పోచారం కాంగ్రెస్‌లో చేరికతో బిఆర్ఎస్ ఆగ్రహం

- ఇంటిముందు ఆందోళనకు దిగిన బాల్క సుమన్
- అరెస్ట్ చేసిన పోలీసులు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్21:

పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన క్రమంలో మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్, ఇతర భారాస నేతలు పోచారం శ్రీనివాసరెడ్డి నివాసానికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ ఉన్న సమయంలోనే నిరసనకు దిగారు. ఈక్రమంలో భారాస, కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట, ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో బాల్క సుమన్, భారాస నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ ఇంటి దగ్గర బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. ఆ క్రమంలో పోచారం ఇంట్లోకి బీఆర్ఎస్ నేతలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బాల్క సుమన్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నేతలను అడ్డుకోగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఎంత సేపటికీ వినకపోవడంతో బాల్క సుమన్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సమాచారం తెలుసుకుని ఆయన ఇంటి వద్దకు చేరుకుని బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. అప్పటికే పోచారం సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి చేరుకుని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే ఈసారి ప్రకటించనున్న మంత్రి వర్గంలో పోచారానికి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# 2కోట్లతో గద్దర్ మల్టీపర్పస్ హాల్

- శంకుస్థాపన చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ

నేటి ఫోకస్ న్యూస్, సంగారెడ్డి-జూన్21:

ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న గద్దర్ మల్టీపర్పస్ ఆడిటోరియం నిర్మాణ పనులకు జూన్ 21న మంత్రివర్యులు శంకుస్థాపన చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రూ.8 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మున్సిపల్ పరిపాలన భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. తెల్లాపూర్ మునిసిపాలిటీలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం 15 రోజుల్లో మొదలు పెడతామని మంత్రి హమీ ఇచ్చారు. చెరువులను, కుంటలను కాపాడుకోవాలని లేదంటే.. భవిష్యత్తు తరాలకు మనుగడ ఉండదని ఆయన హితవు పలికారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టే ప్రతిపనిలో ప్రజలు సహకరించాలని కోరారు.



# రైతాంగానికి గుడ్‌న్యూస్..

(మొదటి పేజీ తరువాయి..)

తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2లక్షల వరకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఏకమొత్తంలో రణమాఫీ చేయడంతో పాటు, విధివిధానాలను రూపొందించనుంది. ఈ క్రమంలో రుణాల మాఫీకి మంత్రివర్గం ఆమోదం ఇచ్చింది. రుణమాఫీకి కటాఫ్ నిర్ణయించింది. డిసెంబర్ 9వ తేదీని రుణమాఫీ కటాఫ్ తేదీగా ఏకగ్రీవ తీర్మానం చేసింది రాష్ట్ర కేబినెట్. అంతేకాదు.. రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 9, 2023 ముందు నాటికి తీసుకున్న రుణాలన్నింటినీ ఒకే విడతలో మాఫీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 47 లక్షలకు పైగా మంది రైతులకు ఊరట లభించనుంది. న్నికల హామీలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో రుణామాఫీలు చేస్తామని హామీ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉండటం కారణంగా ఆలస్యమైంది. ఇప్పుడు ఎన్నికల కోడ్ లేకపోవడంతో రుణాల మాఫీపై స్పీడ్ పెంచింది సర్కార్. ప్రధానంగా ఆగస్ట్ 15 లోపు రైతు రుణాలు మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకటన మేరకు.. ప్రభుత్వం స్పీడ్ పెంచింది. రైతు రుణాల మాఫీ ప్రధానంశంగా రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం నాడు భేటీ అయ్యింది. ఈ భేటీలో రైతు రుణమాఫీ ఎలా చెయ్యాలి. దశల వారీగా చేయాలా? ఒకేసారి చేయాలా? అర్హులు ఎవరు? ఎవరి రుణాలు మాఫీ చేయాలి? అంశాలపై కూలంకశంగా చర్చించారు. అనంతరం.. రైతు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని తీర్మానం చేశారు. అది కూడా ఆగస్ట్ 15 లోపు ఈ పక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. రుణమాఫీపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 9 2023లోపు తీసుకున్న రుణాలన్నీ మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, మద్దతు ధరపై ఈ కేబినెట్ సమావేశంలో ప్రధానంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణతో పాటు విధివిధానాలను కూడా చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నారు. అయితే.. ఈ పథకాలకు ఎవరెవరు అర్హులు అన్న దానిపై నిర్ణయం కూడా తీసుకోనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ ట్యాక్స్ చెల్లింపు దారులు రైతు రుణమాఫీ వర్తించే అవకాశం లేదు. ఇప్పటికే అధికారులు మహారాష్ట్ర, రాజస్థాన్ వెళ్లి అక్కడ అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు అధికారులు. ఈ కేబినెట్ మొత్తం రైతులకు సంబంధించిన ప్రయోజనాలపైనే ఎక్కువగా చర్చించారు. కేబినేట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ విధానమని, రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ.. ఏదైనా మాట చెబితే అది శిలా శాసనం. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొని నిలబడి.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం మా నాయకుల గొప్పతనం.. కమిట్ మెంట్. 2022 మే 6 వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ రుణమాఫీ హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం 2014, 2018లో రుణమాఫీ చేసింది. మొదటిసారి రూ.16వేల కోట్లు, రెండో సారి రూ.12వేల కోట్లు రుణమాఫీ చేసింది. అప్పటి ప్రభుత్వం 2018 డిసెంబరు 11 కటాఫ్ తేదీగా నిర్ణయించింది. మా ప్రభుత్వం 2018 డిసెంబరు 12 నుంచి మొదలు పెట్టి.. 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుంది. ఐదేళ్ల మధ్య కాలంలో ఈ రాష్ట్రంలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. రుణ మాఫీతో 47 లక్షల మంది రైతులకు లబ్ది చేకూర నుందని తెలిపారు. రుణమాఫీ విధివిధానలను జివోలో తెలియచేస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం వేశామని అన్నారు. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో కమిటీ విధి విధానాలు ఖరారు చేస్తుందని అన్నారు. జులై 15లోపు ఉప సంఘం నివేదిక ఇస్తుంది. ఆ నివేదిక ఆధారంగా రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేస్తాం. రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు అవసరమని అంచనా వేశాం. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వ నిర్ణయాలను ఇకపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందిస్తారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి, కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రైతు రుణాలను ఒకే దఫాలో మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. అయితే, ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.

# బిఆర్ఎస్‌కు భారీ షాక్..

(మొదటి పేజీ తరువాయి..)

నేగా పోచారం ఇంటికి వెళ్లారు. కాసేపట్లోనే ఈ ప్రకటన వచ్చింది. అనంతరం రేవంత్, పోచారం మీడియాతో మాట్లాడారు. రైతుల సంక్షేమానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నో సేవలందించారని రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. ఈ విషయంలో పోచారం సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. వ్యవసాయం దండగ కాదని.. పండగ చేసే బాధ్యత తమదని చెప్పారు. రైతు సంక్షేమ రాజ్యం కోసం సహకరించే అందరి మద్దతు తీసుకుని ముందుకెళ్తామన్నారు. పోచారం లాంటి వారి సలహాలు తీసుకుని ముందుకు వెళతామని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. అండగా పెద్దలు నిలబడాలని కోరినట్టు వెల్లడించారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. 'రైతుల సంక్షేమం పై వారి సలహాలు సూచనలు తీసుకుని ముందుకెళతాం. రైతు రుణమాఫీ విధివిధానాలపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నాం. భవిష్యత్‌లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి సముచిత గౌరవం ఇస్తాం. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటాం. ఇది రైతు రాజ్యం.. రైతు సంక్షేమ రాజ్యం.. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకుని పోతాం.' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఉదయం పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తి అయిన వేళ ఇవాళ మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం పార్టీలో చేరుతున్నట్టు మాజీ స్పీకర్ పోచారం మీడియాకు తెలిపారు. రైతు బిడ్డను కాబట్టి.. వ్యవసాయంతో ఉన్నటువంటి అనుబంధం తెలుసు కాబట్టి వారు తీసుకుంటున్న నిర్ణయాలకు అండగా ఉండాలని, రైతులు బాగుపడాలని, వారి కష్టాలు తీరాలని ఉద్దేశంతో రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. కొన్ని సమస్యలు వస్తాయి.. వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నారు. వారి కేబినెట్‌ను అభినందిస్తున్నాను. నా జీవితంలో రాజకీయంగా ఆశించేది ఏం లేదు. రైతులతో పాటు వ్యవసాయం బాగుండాలి. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రగతిలో చేదోడు వాదోడుగా ఉండాలని నిర్ణయించుకున్నాను అని పోచారం తెలిపారు. టీఆర్ఎస్ కంటే ముందు టీడీపీలో ఉన్నాను. ఆనాడు ఉన్న పరిస్థితులను బట్టి టీఆర్ఎస్‌లో చేరాను. కాంగ్రెస్ పార్టీతోనే నా రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. మళ్లీ చివరగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. రేవంత్ కార్యక్రమాలు నచ్చి వారి నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస పార్టీలో చేరాను. రైతుల సంక్షేమాన్ని మాత్రమే నేను కోరుకుంటున్నాను. రేవంత్‌ను భగవంతుడు ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నానని పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నానని.. సీఎం రేవంత్‌ను మనస్ఫూర్తిగా ఇంటికి ఆహ్వానించానని పోచారం తెలిపారు. రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల ప్రగతికి తీసుకున్న నిర్ణయాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. తాను రైతుబిడ్డనని.. అందుకే ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు వివరించారు. సమస్యలను అధిగమిస్తూ సీఎం రేవంత్ ధైర్యంగా ముందుకెళ్తున్నారు. నా జీవితంలో ఆశించేది రైతు సంక్షేమం తప్ప ఇంకేమీ లేదు. గతంలో వ్యవసాయ మంత్రిగా పనిచేశాను. అందరి సహకారంతో రాష్ట్ర భవిష్యత్ కోసం పనిచేస్తాం. నా రాజకీయ జీవితం ప్రారంభమైందే కాంగ్రెస్‌తో. ఆ తర్వాత తెదేపా, భారాసలో పనిచేశాను. రేవంత్ చేపడుతున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే కాంగ్రెస్‌లో చేరాను. తను ఇప్పుడు పదవులకోసం పాకులాడే అవసరం లేదన్నారు. 20 ఏళ్లు రాష్ట్రానికి నాయకత్వం వహించే ఓపిక ఆయనకు ఉంది. మాకు వయసైపోయింది.. పనిచేసే నాయకుడిని ప్రోత్సహించాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లగా, శ్రీనివాస్ రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భేటీ అయ్యారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ నియోజకవర్గం నుంచి 2009 నుంచి 2023 వరకు వరసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎంపిక కావడం విశేషం. ఆ క్రమంలోనే పోచారం తెలంగాణ ప్రభుత్వంలో 2014-2019 వరకు వ్యవసాయ మంత్రిగా, 2019 జనవరి 17 నుంచి 2023 డిసెంబర్ 6 వరకు తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నుంచి కీలక నేతలైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ రంజిత్ రెడ్డి, కేకే, కడియ శ్రీహరి, కడియం కావ్యాలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాదు మరికొన్ని రోజుల్లో ఇంకొంత మంది నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేపథ్యంలోనే పోచారంతో సీఎం భేటీపై ఎమ్మెల్యే దానం స్పందించారు.

# నెరవేరిన చంద్రబాబు శపథం

(మొదటి పేజీ తరువాయి..)



పక్ష సభ్యుల వ్యక్తిగత ధూషణల నేపథ్యంలో ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ, తిరిగి ఈ సభకు ముఖ్యమంత్రిగానే వస్తానని సవాలు చేసిన చంద్రబాబు రెండున్నరేళ్లు తిరిగేసరికీ అన్నంత పనీ చేశారు. నిజానికి అంతకు మించే చేశారు. తనను, తన పార్టనీ తీవ్ర అవమానాలకు గురిచేసిన వైసీపీకి ప్రతిపక్షహోదా సైతం లేకుండా చేసి తలెత్తెకుని అసెంబ్లీలో అడుగుపెట్టారు. మెజార్టీ సాధించి సిఎంగా ప్రమాణం చేసిన చంద్రబాబు రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. వైకాపా నేతలు తీవ్రంగా కించపరడంతో సీఎంగానే మళ్లీ అడుగుపెడతానని 2021లో ఆయన శపథం చేశారు. అది నేడు నెరవేరింది. సమావేశాల ప్రారంభం నేపథ్యంలో అసెంబ్లీకి చంద్రబాబు వచ్చారు. తొలుత అక్కడి మెట్ల వద్ద ప్రణమిల్లి లోపలికి అడుగుపెట్టారు. అనంతరం శాసనసభాపక్ష నేత కార్యాలయంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఆ తర్వాత శాసనసభకు చేరుకున్నారు. ఈ సందర్భంగా 'నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది' అంటూ తెదేపా ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శించారు. సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆలింగనం చేసుకున్నారు. తన సతీమణి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అసెంబ్లీలో అప్పటి మంత్రి అంబటి రాంబాబు మాట్లాడటం, దానికి కొందరు వైకాపా సభ్యులు వంత పాడటం, సభా నాయకుడిగా వారించాల్సిన అప్పటి సీఎం జగన్ వెకిలి నవ్వులతో వారిని ప్రోత్సహించడం తో చంద్రబాబు ఆరోజు తీవ్ర మనస్తాపం చెందారు. ఇన్నేళ్లూ పరువు కోసం బతికాను. అలాంటిది ఈ రోజు సభలో నా భార్య ప్రస్తావన తెచ్చి అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ. ఇలాంటి సభలో నేనుండను. మళ్లీ ముఖ్యమంత్రిగానే ఈ సభలో అడుగుపెడతాను. లేకపోతే నాకు రాజకీయాలే వద్దు. మీ అందరికీ ఓ నమస్కారం' అని 2021 నవంబరు 19న శాసనసభలో చంద్రబాబు తీవ్ర అవమానభారంతో భీషణ ప్రతిజ్ఞ చేశారు. ఆ రోజు నుంచీ ఆయన అసెంబ్లీ సమావేశాలకు వెళ్లలేదు. ప్రజాక్షేత్రంలోనే వైకాపాపై బదులు తీర్చుకుని, ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగు పెట్టారు. చంద్రబాబుకు అసెంబ్లీలో ఎదురైన అవమానాలు చూసిన వారెవ్వరూ మళ్లీ ఆయన పుంజుకోగలుగుతారని ఊహించి ఉండరు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబుకి మొదటి 40 ఏళ్లు ఒక ఎత్తయితే ఈ అయిదేళ్లు ఒకెత్తు. ఈ విషయం చంద్రబాబే స్వయంగా అసెంబ్లీ సాక్షిగా ఎన్నోసార్లు చెప్పారు. గతంలో ఆయన మహా మహా నాయకులను ఢీకొట్టారు. గెలుపోటములు రాజకీయాల్లో సహజం. గెలిచిన పార్టీ నాయకులు ఓడిన నాయకులను విమర్శించడం, ప్రతిపక్షం సైతం అధికార పక్షంపై రాజకీయ విమర్శలు చేయడం సహజం. కానీ జగన్ మార్కు కక్ష సాధింపు రాజకీయం మాత్రం ఆయన ఎదురు చూసింది కాదు. ఎన్నడూ లేనన్ని అవమానాలూ, కక్ష సాధింపులు ఎదుర్కొన్నారు. టీడీపీ నాయకుల ఆర్థిక మూలాల్ని దెబ్బతీశారు. ఆత్మస్థైర్యాన్ని నీరుగార్చారు. అక్రమ కేసులు బనాయించారు. భౌతిక దాడులు, హింస యథేచ్ఛగా సాగాయి. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినా అప్పటి ప్రభుత్వం ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు.ఏకంగా చంద్రబాబు ఇంటిపైకి ఓ నేత మందీమార్బలంతో దండెత్తినా చర్యల్లేవు. చంద్రబాబుపై, తెదేపా నాయకులపై వైసీపీ నాయకులు వెకిలి మాటలతో రెచ్చిపోతోంటే నిలువరించాల్సిన జగన్ అసెంబ్లీలో వారిని నవ్వుతూ ప్రోత్సహించారు. చివరికి తన భార్య వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడేసరికి చంద్రబాబు తట్టుకోలేక పోయారు. తిరిగి ముఖ్యమంత్రయ్యాకే అసెంబ్లీకొస్తానంటూ శపథం చేసి బయటకు వచ్చారు. మీడియా సమావేశంలో ఎప్పుడూ హుందాగా ఉండే మనిషి కన్నీటి పర్యంతమయ్యారు. పెద్ద పెద్ద నాయకులతో పనిచేశాం. కానీ ఈ రెండున్నరేళ్లలో పడ్డ అవమానాలు ఎప్పుడూ చూడలేదు. వ్యక్తిగతంగా, పార్టీపరంగా అవమానించారు. ఏ పరువు కోసం ఇన్నేళ్లుగా బ్రతికానో.. . నా కుటుంబం, నా భార్య విషయం కూడా సభలోకి తీసుకొచ్చ దారుణంగా అవమానించారు' అని భావోద్వేగానికి లోనయ్యారు. తిరిగిఇన్నాళ్ల తరువాత ఆయన ముఖ్యమంత్రిగా అసెంబ్లీలోకి అడుగు పెట్టారు.





# యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

◆ జిల్లా పరిషత్ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి







**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

యోగ అనేది నిత్య జీవితంలో ఒక భాగం కావాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆర్.లోక్ నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అయిష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ మాట్లాడుతూ సనాతన కాలం నుండి భారత దేశంలో ప్రతిరోజూ మన భారతీయులు చేసే యోగా ఆసనాలు నేడు ప్రపంచ ప్రాచుర్యం పొంది ప్రపంచ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. నిత్యం యోగా ద్వారా ఆరోగ్యంతో పాటు మనశ్శాంతి, చురుకుదనం పెరుగుతుందన్నారు. యోగా చేసే విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు వారు నిత్య జీవితం లో చేసే పనుల్లో చాలా చురుకుగా ఉంటారని అన్నారు. గర్భిణీలు యోగా చేయడం ద్వారా సుఖ ప్రసవాలు జరుగుతాయని డాక్టర్లు చెప్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటూ జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చు అన్నారు. ఐ.ఐ.టి, ఎన్.ఐ.టి. పెద్ద పెద్ద యూనివర్సిటీల్లో చదవాలని లక్ష్యంగా పెట్టుకోవాలని విద్యార్థులను సూచించారు. స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక యుగంలో మానసిక ఒత్తిడి, ప్రతి ఒక్కరూ లేచినప్పటి నుండి ఉరుకులు పరుగులతో పనిచేస్తుంటారని తద్వారా ఆరోగ్యం త్వరగా కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. అందువలన ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. అనంతరం దాదాపు 40 నిమిషాల పాటు యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్ , యూత్ అండ్ స్పోర్ట్స్ జిల్లా అధికారి సుధీర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, నేషనల్ కోచ్ మరియు వనపర్తి డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సుగుణ , ప్రెసిడెంట్ రాంరెడ్డి, వై స్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి విద్యార్థులు పాల్గొని యోగా చేశారు.



## మిషన్ భగీరథ సర్వే, అమ్మ ఆదర్శ పాఠశాలల
# పనులు పూర్తి చేయాలి




◆ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**పెద్దమందడి నేటి ఫోకస్ న్యూస్:**

మిషన్ భగీరథ సర్వే, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి, పామిరెడ్డిపల్లి, ఖిల్లా గణపురం మండలంలోని సోలిపూర్ గ్రామాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల ప్రాణాలను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాలను వెంటనే సమకూర్చాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



◆ యోగ ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ

◆ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 21:** యోగ ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే దిమ్ తో జరిగిన, 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించామని, కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం పికెట్ గార్డెన్ లో ఉదయం 6 నుండి 7:30 వరకు యోగ కార్యక్రమాలను చేపట్టారు. సీఈఓ మధుకర్ నాయక్ మాట్లాడుతూ... యోగ ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ అధికారి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరేపల్లి పరశురామ్, బోర్డు అధికారులు మహేందర్, దేవేందర్, డిఈవో కార్యాలయ సిబ్బంది, భారతీయ యోగ్ సంస్థల సభ్యులు, వివిధ సంస్థల వాలంటీర్లు పాల్గొన్నారు.







## ఎమ్మెల్యే సహకారంతో రెండో వార్డులో
# వీధి దీపాలకు మోక్షం

◆ రెండో వార్డులోని ఏ సమస్య లేకుండా చూస్తాం: సామ్సన్ రాజు

◆ ఎమ్మెల్యే శ్రీ గణేష్, స్థానిక నాయకుడు సామ్సన్ రాజు లకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 21:**

గత నెల నుండి కంటోన్మెంట్ నియోజకవర్గ 2వ వార్డు అన్న నగర్ లో వీధి దీపాలు స్ట్రీట్ లైట్లు సరిగా పని చేయకపోవడం వలన, బస్తి ప్రజలు చీకట్లో ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, స్థానిక ప్రజలు రెండో వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ్సన్ రాజు దృష్టికి తీసుకువెళ్లారు. రెండోవ వార్డులో వీధి దీపాలతో పాటు అనేక సమస్యలు ఉన్నాయని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, సామ్సన్ రాజు ఎమ్మెల్యే శ్రీ గణేష్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ తక్షణమే రెండవ వార్డులోని వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కంటోన్మెంట్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏఈ శ్రావణ్ కు తెలుపగా, రెండో వార్డులోని విధి దీపాలను వేయించారు. చీకట్లో నుండి వెలుతురుకు మోక్షం వచ్చినందున, రెండో వార్డు బస్తి ప్రజలు ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు, రెండో వార్డు స్థానిక నాయకుడు సామ్సన్ రాజు కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మురళి, సంద్రపాటి నాగరాజు, ధర్మేందర్, మహేందర్, మహేష్ యాదవ్, దుర్గా రవికుమార్, వరప్రసాద్ నర్సింగ్ సురేష్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఒత్తిడిని తగ్గించుకోండి

◆ టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు

◆ ఎస్ఎస్.పి ఆధ్వర్యంలో యోగ డే 6వ ఎడిషన్

**ఫోకస్ న్యూస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 21:** యోగా చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ), తెలంగాణ ఈవెంట్ ఫెసిలిటేటర్స్ అసోసియేషన్ (టీఈఎఫ్ఏ) ఆధ్వర్యంలో 'యో! గ్లామర్ ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా' ను సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ఒత్తిడితో కూడిన ఉద్యోగాలలో ఈవెంట్ పరిశ్రమ ఉద్యోగాలు రెండో స్థానంలో ఉన్నాయన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఈవెంట్‌లు చేయడంతో ఒత్తిడిని భరిస్తున్నామన్నారు. ప్రయాణాలు కూడా చేయాల్సి వస్తుందన్నారు. అందుకే ఒత్తిడిని తగ్గించేందుకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 2018 నుంచి యోగా డే నిర్వహిస్తున్నామన్నారు. ఇది ఆరో ఎడిషన్ అన్నారు. గత ఏడాది ఈ కార్యక్రమాన్ని బన్సీలాల్‌పేట్ స్టెప్‌వెల్ వద్ద చేశామన్నారు. మన సభ్యులలో కొంతమంది జీవితకాల యోగా అభ్యాసకులుగా మార్చడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఆ విధంగా సభ్యులకు ప్రయోజనం చేకూరుస్తున్నామని తెలిపారు. అంతకుముందు జ్యోతి సుకుమార్ మార్గ నిర్దేశనంలో జుంబా సెషన్ నిర్వహించారు. టీచర్ సోనాలి మోర్గే యోగా చేయించారు. యోగా స్థానాల ప్రాముఖ్యతను వివరించారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిపారు. ఈ ఈవెంట్‌కు 125 పైగా సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీఈఎఫ్ఏ–టీసీఈఐ అధ్యక్షుడు మనోజ్ ఇనాని, టీసీఈఐ జనరల్ సెక్రటరీ రవి బురా, టీఈఎఫ్ఏ–టీసీఈఐ సెక్రటరీ సందీప్ జైన్, టీఈవీఏ – టీసీఈఐ సెక్రటరీ ప్రవీణ్ అగర్వాల్, కోశాధికారి పవన్ కుమార్ అగర్వాల్, యో కన్వీనర్ జిగ్నా మెహతా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి టీసీఈఐ, టీఈఎఫ్ఏ స్పాన్సర్‌లు మద్దతు ఇచ్చారు. టైటిల్ స్పాన్సర్‌గా ఎస్ఎస్పీ ఈవెంట్ వ్యవహరించింది. సహ–స్పాన్సర్లు ఏ4 ఈవెంట్, టీమ్ ఆర్యన్, ఈవెంట్ కోసం వేదికను క్లాసిక్ గార్డెన్స్‌కు చెందిన ప్రవీణ్ అగర్వాల్ స్పాన్సర్ చేశారు.





# నూతన కలెక్టర్‌కు జర్నలిస్టుల ఘన సన్మానం

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

వనపర్తి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ్ సురభిని జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబటి స్వామి, పవన్ కుమార్ లు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు , హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కరించాలని అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య అందించే విధంగా అన్ని ప్రైవేట్ పాఠశాలలకు అధికారికంగా సర్కులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు డి.రవిప్రసాద్, కే. ఆంజనేయులు, కే. హుస్సేన్, కార్యదర్శులు కె .శేఖర్, సాయిరాం, శివన్న, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



# సెయింట్ మేరీస్ పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం

**ఫోకస్ న్యూస్ ప్రతినిధి బామిడని రఘుపతి, (స్టేట్ కోఆర్డినేటర్)–జూన్21:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో సెయింట్ మేరీస్ పాఠశాలలో ప్రపంచ యోగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి యోగ శిక్షకులు శ్రీ ప్రకాష్ రావు గారు ముఖ్య అతిథిగా రావడం జరిగింది. యోగా చేయడం వలన కలిగే లాభాలు రక్త ప్రసరణ ఊపిరితిత్తులు నరాలు ఎముకలు మన శరీరంలో ఉన్నటువంటి అవయవాల అన్ని కూడా చక్కగా పనిచేసేటటువంటి శక్తి కలిగిస్తుంది యోగ, మనశ్శాంతి మంచి ఆలోచన జీర్ణశక్తి ఏకాగ్రత పెరుగుతుందని విద్యార్థులకు వివరించారు దీనివల్ల విద్యార్థులు మెరుగైన చదువులు చదువుతారని వారు వివరించారు ఈ కార్యక్రమంలో ఫాదర్ రాబర్ట్ ఫాదర్ పీటర్ పీటి మహేష్. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవం

**ఫోకస్ న్యూస్ ప్రతినిధి బామిని రఘుపతి (స్టేట్ కోఆర్డినేటర్)–జూన్21:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం స్థానికత జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం భాగంగా యోగ శిక్షకులు నరేష్ గారు స్కూలు విద్యార్థి విద్యార్థులకు అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క ప్రాముఖ్యత మరియు యోగ ప్రయోజనాలను వివరించడం జరిగింది .ఇట్టి కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ముద్ద నాగనాథ్, వైస్ చైర్మన్ కూచి శ్రీనివాస్ సెక్రెటరీ పోలా వెంకటేశం, కరస్పాండెంట్ రఘు వర్ధన్ రెడ్డి, డైరెక్టర్ అమరేందర్ రెడ్డి , ప్రిన్సిపాల్ ప్రణీత రెడ్డి మరియు స్కూల్ టీచర్లు పాల్గొనడం జరిగినది.



# కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ..

◆ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తా..

◆ కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్

**ఫోకస్ న్యూస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 21:**

మారేడ్పల్లి, తిరుమలగిరి, సికింద్రాబాద్ మండలాల పరిధిలోని కళ్యాణలక్ష్మి షాది ముబారక్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ 152 చెక్కులను దాదాపు కోటిన్నర రూపాయల విలువ చేసే చెక్కులను కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్, తహసిల్దార్ల తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని పేద ప్రజల కోసం ఇంకా ఎన్నో సంక్షేమాలు తీసుకువచ్చే దిశగా ప్రక్రియ చేస్తుందని మరియు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల తాసిల్దారులు పాండు నాయక్, అశోక్ కుమార్, శివకుమార్, మారేడుపల్లి డిటి శివకుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కల్కి చిత్రానికి సెన్సార్ పూర్తి

## మూవీ రన్‌టైమ్ 180 నిమిషాలు

ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పడుకోణె, దిషా పటాని లాంటి నటీనటులు నటించిన 'కల్కి 2898 ఏడి' సినిమా ఈనెల 27న విడుదలవుతున్న సంగతి తెలిసిందే. నాగ్ అశ్విన్ ఈ సినిమాకి దర్శకుడు. ఇది ఒక సైన్స్ ఫిక్షన్ కథ అని ముందే చెప్పారు. ద్వాపర యుగం అయిన తరువాత, కలియుగం తరువాత కొన్ని సంవత్సరాలు ఇలా మూడు ప్రదేశాల్లో జరిగియే కథలు చూపించటానికి ప్రయత్నం చేశారు దర్శకుడు. వాటికే కాంప్లెక్స్, కాశీ, శంబాలా అని ఇలా మూడు పేర్లు పెట్టి ఈ మూడు పట్టణాల్లో జరిగే సంఘటనలు చూపించినట్టుగా తెలుస్తోంది. ఈ సినిమా సెన్సారు కార్యక్రమాలు హైదరాబాదులో పూర్తయ్యాయి అని తెలుస్తోంది. ఈ సినిమాకి ముందుగా వాయిస్ ఓవర్ లో డిస్క్రిమినేషన్ ఇవ్వవలసిందిగా సెన్సారు సభ్యులు కోరినట్టుగా తెలిసింది. ఈ సినిమా కల్పిత కథ అని సెన్సారు సభ్యులు వెయ్యమన్నారు అని తెలిసింది. అలాగే ఈ కథలో సినిమా కోసం సినిమా లిబర్టీ తీసుకున్నారని, అంతేకానీ ఏ మతాన్ని కించపరచాలని ఉద్దేశం తమకి లేదని కూడా వెయ్యమన్నట్టుగా సినిమా చూసిన సెన్సార్ సభ్యులు చెప్పినట్టుగా తెలిసింది. అలాగే ఎక్కువగా కట్స్ ఏమీ లేకుండానే ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చినట్టుగా తెలిసింది. సర్టిఫికెట్ లో ఈ సినిమా నిడివి 180 నిమిషాల 56 సెకండ్స్ వున్నట్టుగా తెలిసింది. 180 నిముషాలు అంటే మూడు గంటల పాటు ఈ సినిమా ఉంటుంది. ఇది ప్రభాస్ సినిమాలు అన్నిటికన్నా చాలా ఎక్కువ నిడివి వున్న సినిమా అని తెలుస్తోంది. ప్రభాస్ ముందు సినిమా 'ఆదిపురుష్' నిడివి 179 నిముషాలు ఉంటే, ప్రభాస్ ఇంకో సినిమా 'సలార్' సినిమా నిడివి 175 నిముషాలు ఉంటుంది. ఇంకో సినిమా 'సాహో' కూడా 171 నిముషాల నిడివి వుంది. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'బాహుబలి', 'బాహుబలి 2' సినిమాలు కూడా వరసగా 159, 168 నిముషాల నిడివి ఉంటుంది. ఇప్పుడు వచ్చిన 'కల్కి 2898ఏడి' ఇప్పటివరకు విడుదలైన ప్రభాస్ సినిమాలలో ఎక్కువ నిడివి కలిగిన చిత్రంగా వుంది.




# శృతికి చిర్రెత్తించిన నెటిజన్

ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నపై నటి శ్రుతి హాసన్ అసహనం వ్యక్తంచేశారు. 'మాలా ఉండేందుకు ప్రయత్నించకండి' అంటూ సదరు వ్యక్తికి సూచించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శ్రుతి తన సినిమాల విశేషాల తోపాటు అప్పుడప్పుడు అభిమానులు, నెటిజన్లతో ముచ్చటిస్తుంటారనే సంగతి తెలిసిందే. 'సౌత్ ఇండియన్ యాసలో ఏదైనా చెప్పండి' అంటూ సదరు నెటిజన్ కోరగా ఆమె స్పందించారు. ఓకే.. ఇలాంటి వివక్షలే వద్దు. మీరు మమ్మల్ని చూసి ఇడ్లీ, సాంబార్ అని అనడం సరైంది కాదు. మీరు మమ్మల్ని అనుకరించలేరు. మాలాగా ఉండేందుకు ప్రయత్నించొద్దని అన్నారు. బాలీవుడ్ నటులు.. దక్షిణాది నటులను చిన్నచూపు చూస్తుంటారని, దాన్ని దృష్టిలోపెట్టుకుని ఆమె ఇలా సమాధానం ఇచ్చారేమోనని పలువురు అభిమానులు అభిప్రాయం వ్యక్తంచేశారు. పలు సినీ వెబ్‌సైట్స్ సైతం ఈ కోణంలోనే కథనాలు రాశాయి. కొన్ని నెలల క్రితం జరిగిన ఓ పెళ్లి వేడుకలో బాలీవుడ్ హీరో ఒకరు.. దక్షిణాది హీరోను చులకనగా చూడడమే శ్రుతి అసహనానికి కారణమై ఉండొచ్చని పేర్కొన్నాయి. ఇటీవల తన రిలేషన్ స్టేటస్ గురించి తెలిపిన సంగతి తెలిసిందే. 'మీరు సింగిలా.. రిలేషన్‌లో ఉన్నారా?' అని సోషల్ మీడియా వేదికగా ఒకరు ప్రశ్నించగా తనకు ఆ తరహా ప్రశ్నలు నచ్చవంటూనే సింగిలే అని క్లారిటీ ఇచ్చారు. రిలేషన్ కోసం ఎదురుచూస్తున్నానన్నారు. సినిమాల విషయానికొస్తే.. 'డకాయిట్' , 'చెన్నై స్టోరీ'ల్లో నటిస్తున్నారు. 'సలార్' సీక్వెల్ 'సలార్ 2' లోనూ సందడి చేయనున్నారు.

# ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా రజనీకాంత్

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ తో 'కూలీ' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా నుండి ఒక చిన్న ప్రచార వీడియోని కూడా ఆమధ్య ఒకటి విడుదల చేశారు. అయితే తాజా సమాచారం ప్రకారం రజనీకాంత్ ఈ సినిమాలో ఎటువంటి పాత్ర చెయ్యబోతున్నారు అనే విషయంపై లీక్ అయింది. ఆ లీకైన సమాచారం ప్రకారం రజనీకాంత్ ఈ సినిమాలో ఒక ఎన్ కౌంటర్ స్పెషలిస్టు పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఆసక్తికరం ఏంటంటే రజనీకాంత్ ఇంకో సినిమా 'వెట్టయ్యాన్' లో కూడా పోలీసు పాత్రలోనే రజనీకాంత్ కనపడనున్నారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే, రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ సినిమాలో మలయాళం సూపర్ స్టార్ ఫహాద్ ఫాజిల్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనపడనున్నారని తెలుస్తోంది. ఈ పాత్ర అనుకున్న వెంటనే ఫహాద్ అయితే బాగుంటారు అని అతనికి వెంటనే కథ చెప్పడం జరిగిందని, ఫహాద్ చెయ్యడానికి అంగీకరించారని తెలిసింది. ఈ సినిమాలో రజనీకాంత్ ఎన్ కౌంటర్ స్పెషలిస్టు అయితే, అతనికి ఒక ఆధునిక సాంకేతిక ప్రత్యేక అధికారిగా రజనీకాంత్ వెన్నంటే వుండే పాత్రలో ఫహాద్ కనిపించనున్నారని తెలుస్తోంది. కేవలం రజనీకాంత్ ఇందులో కథానాయకుడిగా చేస్తున్నారని, ఫహాద్ ఈ పాత్ర ఒప్పుకున్నట్టుగా తెలిసింది. ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం అవుతుందని కూడా తెలుస్తోంది. ఫహాద్ ప్రస్తుతం 'పుష్ప 2' సినిమా చిత్రీకరణలో వున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకి సుకుమార్ దర్శకుడు. ఈ సినిమాలో ఫహాద్ పోలీసు ఆఫీసరుగా కనిపించనున్నారు.






# కల్కి ప్రమోషన్స్ జోరు

## తాజాగా కైరా పాత్ర విడుదల..

'కల్కి 2898 ఏడీ' విడుదల సమయం సమీపిస్తుండడంతో చిత్రబృందం ప్రచారాన్ని వేగవంతం చేసింది. ఓవైపు వేడుకలు నిర్వహిస్తూ మరోవైపు.. సినిమాలో కీలక పాత్రలు పోషించిన వారి లుక్స్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటోంది. ఈ క్రమంలోనే 'ది లక్కీ రెబల్' అంటూ కైరా క్యారెక్టర్ ప్లే చేసిన నటిని గురువారం సాయంత్రం ప్రత్యేకంగా పరిచయం చేసింది. దీంతో, ఆమె గురించి తెలుసుకునేందుకు చాలామంది నెట్టింట తెగ వెతికేస్తున్నారు. ఈ మలయాళ నటి 'కల్కి'లోని ఓ పాత్రకు ఎంపికైనట్టు చాలా తక్కువమందికి తెలుసు. తాజా పోస్టర్‌తో ఆమె పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆమె.. అన్నా బెన్. కొచ్చికి చెందిన బెన్ అక్కడే 'ఫ్యాషన్ అండ్ అపెరల్ డిజైనింగ్'లో పట్టా పొందారు. తన తండ్రి స్క్రీన్ రైటర్ బెన్నీ పి. నాయరాంబలం. మలయాళంతోపాటు తమిళ్ చిత్ర పరిశ్రమలో పనిచేశారాయన. సినీ నేపథ్య కుటుంబం కావడంతో అన్నాకు బాల్యంలోనే నటనపై ఆసక్తి కలిగింది. చదువు పూర్తయిన అనంతరం.. మలయాళ సినిమా 'కుంబలంగి నైట్స్' (2019)తో తెరంగేట్రం చేశారు. ఉత్తమ పరిచయ నటిగా 'సైమా', 'కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్' సహా పలు పురస్కారాలు అందుకున్నారు. కమర్షియల్‌గానూ ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. చేసింది తక్కువ సినిమాలే అయినా అన్నింటిలోనూ తనదైన ముద్ర వేసుకొంది. ప్రతీ సినిమాకి ఏదో ఒక అవార్డు సొంతం చేసుకోవడం ఆమెకు అలవాటుగా మారింది. ఈ బ్యూటీ నటించిన 'కొట్టుక్కాళి' చిత్రం 74వ బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమవడం విశేషం. ఆమె నటించిన తొలి తమిళ్ సినిమా ఇదే. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు ఆడియన్స్‌ను నేరుగా పలకరించనున్నారు. 'దర్శకుడు నాగ్ అశ్విన్ 'కల్కి' గురించి చెప్పగానే ఎంతో ఆనందించా. ఇప్పటివరకూ నేను సైన్స్ ఫిక్షన్ సినిమా చేయలేదు. ఆ డ్రీమ్ 'కల్కి'తో నెరవేరింది. ప్రభాస్ , అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి ప్రతిభావంతులతో కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం. ఇందులో నేను పోషించిన పాత్ర చిన్నదే అయినా ప్రేక్షకులపై మంచి ప్రభావం చూపుతుందని ఓ ఇంటర్వ్యూలో ఆశాభావం వ్యక్తంచేశారు.




# డాన్-3లో రణ్‌వీర్‌తో కియారా..

గతేడాది 'సత్యప్రేమ్ కీ కథా' సినిమాతోనే సరిపెట్టుకున్న బాలీవుడ్ కథానాయిక కియారా అడ్వాణీ.. ఈ ఏడాది ఆ లోటును తీర్చడానికి వరుస సినిమాలతో రావడానికి ముస్తాబవుతోంది. త్వరలో 'గేమ్ ఛేంజర్'తో ప్రేక్షకులను పలకరించనున్న ఈ భామ.. రణ్‌వీర్ సింగ్‌తో 'డాన్ 3' కోసం జతకట్టిన సంగతి తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఫర్హాన్ అక్తర్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను వచ్చే ఏడాదిలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు దర్శకుడు. పరిశ్రమకు పరిచయమవుతున్న ఈ నయా డాన్ పాత్రను మునుపెన్నడూ చూడని విధంగా తీర్చిదిద్దుతున్నారట. మొదటి షెడ్యూల్‌లో భాగంగా ఈ సినిమాకే కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'సింగమ్ అగైన్' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు రణ్‌వీర్‌సింగ్.

